ఫీజుల మోత..!



- టెక్నోల పేరుతో.. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లలో విద్యావ్యాపారం
- తల్లిదండ్రుల జేబులకు చిల్లు
- పట్టించుకోని విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్లు చేయించుకుంటున్నాయి. పరిమితి సీట్లు అంటూ బోర్డులు పెట్టి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. దీనితో తల్లిదండ్రులు తమ పిల్లలకు ముందుగానే అడ్మిషన్లు పొందుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలుగా చెప్పుకొంటున్నా అక్కడ వాస్తవానికి మౌలిక సదుపాయాలు దారుణంగా ఉంటున్నాయి. చాలా పాఠశాలలను ఇరుకు భవనాల్లో నడుపుతున్నారు. క్రీడామైదానాలు కనిపించవు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్లు మరుగుదొడ్లు ఉండడం లేదు.

తల్లిదండ్రుల బలహీనతే వారికి వరం

తల్లిదండ్రులు తమ ఆర్థిక స్థోమతతో సంబంధం లేకుండా పిల్లలను మంచి స్కూల్లో చేర్పిం చాలని తాపత్ర యపడుతున్నారు. ఈ బలహీనతే కార్పొరేట్ స్కూళ్లకు వరంగా మారింది. కొంతమంది తల్లిదండ్రులు ఏ పాఠశాలలో ఫీజులు ఎక్కువగా ఉంటాయో, మార్కెట్‌లో దేనికి ఎక్కువ పేరుందో విచారించి.. అలాంటి పాఠశాలలోనే పిల్లలను చేర్పిం చేందుకు తపన పడుతున్నారు. దీనితో స్కూల్లో అడుగుపెడితే అడ్మిషన్ ఫీజు పేరుతో రూ.2వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారు.

పాఠశాలల వివరాలు

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు మొత్తం 769 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 252, ప్రాథమికోన్నత పాఠశాలలు 183, ఉన్నత పాఠశాలలు 332, హైస్కూల్ ప్లస్ 2 పాఠశాలలు ఉన్నాయి. వీటిన్నింటిలో కలిపి 1,88,348 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 63,419 మంది, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 28,003 మంది, ఉన్నత పాఠశాలల్లో 95,702 మంది, హైస్కూల్ ప్లస్‌లో 1,224 మంది విద్యార్థులు చదువుతున్నారు.

అమలుకాని ఫీజు నియంత్రణ చట్టం

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులపై అధ్యయనం చేయడానికి ఐఏఎస్ అధికారులతో గత ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీని నియమించింది. ఏ పాఠశాలలో ఎంత ఫీజు వసూలు చేస్తున్నారో ప్రాంతాల వారీగా ఈ కమిటీ పరిశీలించి నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందించింది. పాఠశాలల్లో మౌలిక వసతులు బోధన, బోధనేతర సిబ్బంది తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో పాఠశాలలను ఐదు కేటగిరీలుగా విభజించారు. అలాగే.. ఎంత ఫీజు వసూలు చేస్తున్నారు.. ఎంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలల్లో ఉన్న ప్రత్యేకతలు ఏమిటి తదితర సౌకర్యాల వివరాలను తల్లిదండ్రులకు కనిపించేలా బోర్డులో ప్రదర్శించాలి.. పాఠశాలల్లో వసూలుచేసే ఫీజులకు రసీదులు ఇవ్వాలి.. ఇలా పలురకాల నిబంధనలు కూడా విధించారు. అయితే దీనిపై ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్లు కోర్టులను ఆశ్రయించాయి. దీంతో ఫీజుల నియంత్రణ చట్టం వైసీపీ ప్రభుత్వంలో అమలు కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేస్తే విద్యార్థుల తల్లిదండ్రులకు కొంత ఊరట లభిస్తుంది.

> జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కాన్సెప్ట్, ఐఐటీ, టెక్నో, ఈటెక్నో, స్మార్ట్, టాలెంట్, ఒలంపియాడ్, సీబీఎస్సీ.. ఇలా ఆకర్షణీయమైన పేర్లతో బోర్డులు పెట్టుకుని ఫీజులు దండుకుంటున్నారు. ఇది చాలదన్నట్లు బహిరంగ మార్కెట్‌లో రూ.2వేల నుంచి రూ.3వేలకు లభించే యూనిఫాం, పుస్తకాలకు కార్పొరేట్ విద్యాసంస్థల్లో రూ.8వేల నుంచి రూ.10వేలు వసూలు చేస్తున్నారు. ఈ ఫీజులను నియంత్రించడంలో మాత్రం విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారు.

ఇదీ ఫీజుల చిట్టా

అడ్మిషన్ ఫీజుతో పాటు.. ట్యూషన్ ఫీజు, స్పెషల్ ఫీజు, స్కూల్ డెవలప్‌మెంట్ ఫీజు బిల్డింగ్ ఫీజు, కంప్యూటర్ ఫీజు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లైబ్రరీ, లేబొరేటరీ, ఫర్నిచర్, కాషన్ ఫీజు, స్మార్ట్ క్లాసులు.. ఇలా ఫీజుల చిట్టా విప్పుతూ ఊపిరి పీల్చుకోనివ్వకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. కొత్తగా అడ్మిషన్ తీసుకుంటే రెగ్యులర్ ఫీజుతో పాటు అదనపు భారాన్ని మోయాల్సిందే. అతికష్టం మీద ఈ ఫీజులు చెల్లించిన తర్వాత పుస్తకాలు, యూనిఫాం, షూలు, అట్లలు.. ఇలా వాటి జాబితా కూడా చాంతాడంత ఉంటుంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఫస్ట్ టర్మ్ ఫీజు 60శాతం చెల్లించి బతుకుజీవుడా అనుకుంటూ బయటపడే లోపే రెండవ టర్మ్ చెల్లించాలని లేదంటే పరీక్షలు రాయించమని పిల్లల డైరీలో రాసి పంపిస్తుంటారు. కనీస సదుపాయాలు లేని పాఠశాలలు సైతం ఫీజుల విషయంలో నిక్కచ్చిగా ఉంటున్నాయి.

అధిక ఫీజులు వసూలుచేస్తే చర్యలు తప్పవు

జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలుచేస్తే కఠినచర్యలు తప్పవు. అధిక ఫీజులు వసూలు చేశారని ఎవరైనా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి సంబంధిత పాఠశాల గుర్తింపు రద్దుచేస్తాం. తల్లిదండ్రులు కూడా ఒకసారి ఆలోచన చేయాలి. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లతో నాణ్యమైన విద్యా బోధనతో పాటు ఉచిత భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, షూస్, బెల్టు, బ్యాగ్ కూడా అందిస్తున్నాం.



- షంషుద్దీన్, డీఈఓ

ఘనంగా పల్నాడు అంకాలమ్మ ఉత్సవాలు

- ముళ్లకంపలో దొర్లిన భక్తులు

బి.కోడూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెంలో పల్నాడు అంకాలమ్మ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి దండకం చదివి పొట్టేలును బలి ఇచ్చి పేగులను ముళ్లకంపకు చుట్టారు. అంకాలమ్మ, చెన్నకేశవుడి విగ్రహాలతో భక్తులు కంపల్లో దొర్లారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు రావడంతో బి.కోడూరు ఎస్‌ఐ వెంకటసురేశ్ గట్టి బందోబస్తు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలను బద్వేలు ఇన్‌చార్జి రితేశ్‌రెడ్డి ప్రారంభించారు. బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన దార్వల గుర్విరెడ్డి



ముళ్లకంపలో దొర్లుతున్న భక్తులు

ఎద్దులు రూ.లక్ష గెలుచుకున్నాయి. అలాగే రెండో బహుమతి మైదుకూరు పట్టణానికి చెందిన వెంకటేశ్‌యాదవ్‌కు రూ.80వేలు దక్కింది. మూడో బహుమతి రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డికి రూ.50వేలు ఆలయ కమిటీ సభ్యులు అందించారు. రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు ఓ.రమణారెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. భక్తులకు మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నదానం నిర్వహించారు. పల్నాడు అంకాలమ్మ తల్లిని శుక్రవారం బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేలు ఇన్‌చార్జ్ రితీశ్‌రెడ్డి, పీసీసీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎల్ఎస్‌పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వెంకటరమణారెడ్డి దర్శించుకున్నారు. వీరివెంట సీనియర్ టీడీపీ నాయకులు ఓ.జయరామిరెడ్డి, కల్లూరు క్రిష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన డీఎస్పీ

జమ్మలమడుగు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పాత బస్టాండు చుట్టూ ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారింది. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు తాడిపత్రిరోడ్డు, ప్రొద్దుటూరు రోడ్డులో ట్రాఫిక్ సమస్యతో జనం ఇబ్బందులు పడుతున్నా పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం జమ్మలమడుగు పాత బస్టాండు నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ట్రాఫిక్‌లో డీఎస్పీ వెంకటేశ్వర రావు వాహనం ఉంది. ఎంత సేపు సైరన్ వేసినా ఒక్కరూ స్పందించలేదు. దాదాపు 20 నిమిషాలపాటు డీఎస్పీ వాహనంలో ఉండిపోయారు. ఈ సమస్యకు సంబంధించి డీఎస్పీని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా ట్రాఫిక్ సమస్యపై త్వరలో ఆర్టీసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.



ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన డీఎస్పీ వాహనం

జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ 2024 సంవత్సరానికి టెన్జింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కోసం ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్టెప్ సీఈవో సి.సాయిగ్రేస్ వెల్లడించారు. ఈ అవార్డుకు 2022, 2023, 2024 సంవత్సరాలలో భూమి, నీరు (సముద్రం), ఆకాశంలో చేసిన సాహస కార్యకలాపాలలో అత్యుత్తమ విజయాలు సాధించిన వారిని పరిగణనలోకి తీసుకుంటాని పేర్కొన్నారు. సాహస క్రీడల్లో నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డును ఏటా రాష్ట్రపతి చేతులమీదుగా బహూకరిస్తారని తెలిపారు. అవార్డు గ్రహీతలకు టెన్జింగ్ నార్గే కాంస్య విగ్రహం, ప్రశంసా పత్రంతో పాటు రూ.15 లక్షల నగదు అందిస్తారని వివరించారు. అవార్డు కోసం ఆన్‌లైన్ వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్//ఎడబ్ల్యు ఎఆర్‌డిఎస్.జీఓవీ.ఐఎన్ ద్వారా ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏదేని ఇతర వివరాలకు 9949298810, 9849497011 నెంబర్లను కార్యాలయ పనివేళల్లో సంప్రదించాలని కోరారు.

ఉనికి కోసమే వైసీపీ నిరసనలు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి



కడప ఎర్రముక్కపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల విధ్వంస పాలన సాగించి ఘోరపరాజయం పొందిన వైసీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు నిరసన ర్యాలీలు చేస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభివృద్ధి సంక్షేమం ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని స్పష్టం చేశారు. శుక్రవారం కడప ద్వారకానగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు టీడీపీ హయాంలోనే ఏర్పాటు జరిగిందన్నారు. జీఎన్ఎస్ఎస్, హెచ్ఎంఎస్ఎస్ ప్రాజెక్టులకు టీడీపీ హయాంలో అంకురార్పణ జరిగిందన్నారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు సంబంధించి ఒక్క తట్ట మట్టి అయినా ఎత్తారా అని ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తిచేయకుండా ప్రజల కోసం పనిచేసే టీడీపీ ప్రభుత్వాన్ని కించపరుస్తూ మళ్లీ దగా చేశారంటూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమకు సంబంధించి కొప్పర్తి, ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సమకూరుస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేసిన చోటే జిందాల్ సంస్థతో నిర్మాణం చేపట్టి మూడేళ్లలో పూర్తిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే రూ.1,10,000 కోట్లతో 27 మేజర్, మైనర్ సోలార్ విండ్ ప్రాజెక్టులను నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నట్లు స్పష్టం చేశారు. కడప జిల్లాతో పాటు రాయలసీమ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని నిరంతరం కృషిచేస్తుందని చెప్పారు.

ప్రజలకు కలెక్టర్ బక్రీద్ శుభాకాంక్షలు


కడప కలెక్టరేట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక అయిన జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు బక్రీద్ పర్వదినం అత్యంత భక్తి ప్రీతికరమైనదన్నారు. ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్య ఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకు పోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగ్రత పరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగ నిరతికి ప్రతీకగా జరుపుకొనే పండుగ బక్రీద్ అని కలెక్టర్ తెలిపారు.

ప్రారంభమైన డీఎస్సీ పరీక్షలు

కడప ఎడ్యుకేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ-2025 పరీక్షలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం జరిగిన పరీక్షలకు 936 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 862 మంది (92శాతం) హాజరయ్యారు. 72మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షలకు 845 మందికి గాను 722 మంది (85శాతం) అభ్యర్థులు హాజరయ్యారు. 123 మంది గైర్హాజరయ్యారు. కడప నగరంలో డీఎస్సీ పరీక్ష కేంద్రాలను డీఈవో షంషుద్దీన్ తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కళాశాలల యాజమాన్యాలకు సూచించారు.

నేడు డీసీసీబీ చైర్మన్ ప్రమాణ స్వీకారం

కడప రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్‌గా టీడీపీ నేత మంచూరు సూర్యనారాయణరెడ్డి శనివారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల సమయంలో కడప నగరం ఊటుకూరులోని మాధవి కన్వెన్షన్ హాలులో ప్రమాణస్వీకార మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఉన్న జాయింట్ కలెక్టర్‌తో పాటు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్లమెంట్ అధ్యక్షులను, కూటమి ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను, ఇతర ప్రజాప్రతినిధులను, నియోజకవర్గ ఇన్‌చార్జిలను, ముఖ్య నేతలను, నాయకులను, సంబంధిత శాఖల అధికారులను ఆహ్వానించారు. ప్రమాణ స్వీకారం అనంతరం డీసీసీ బ్యాంకుకు చేరుకుని అధికారులతో సమావేశం కానున్నారు. అలాగే జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్‌గా ఎర్రగుండ్ల జయప్రకాశ్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. కాగా.. డీసీసీబీకి చైర్మన్ హోదాలో రైతులకు, ఇతర వర్గాల ప్రజలకు సేవచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా అని మంచూరు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఆశయాలకు అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో డీసీసీ బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.


ప్రమాణ
స్వీకారోత్సవ
శుభాకాంక్షలు
నిరంతర నిర్విరామ ప్రజా సేవకుడు, ప్రజల మనిషి,
సేవాతత్పరుడు, యంగ్ డైనమిక్ లీడర్
శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి గారు
నేడు (7-06-2025) కడప డి.సి.సి. బ్యాంక్ ఛైర్మెన్‌గా
ప్రమాణ స్వీకార చేస్తున్న శుభసందర్భంగా వారికివే మా
హృదయపూర్వక శుభాకాంక్షలు. భవిష్యత్‌లో మరిన్ని
ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకుంటూ...
మన్నె రాజశేఖర్ రెడ్డి
Managing Partner
మంచూరు
తేజేశ్వర్ రెడ్డి, M.D.
ARCHSTONE
DEVELOPERS
శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి గారు
కడప డి.సి.సి. బ్యాంక్ ఛైర్మెన్
M/s DHATRI INFRA
ENGINEERS & CONTRACTORS

వేంపల్లె విద్యార్థులకు ప్రతిభ అవార్డులు



సాయినాథ్, గురుభావన

వేంపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె చైతన్య హైస్కూల్లో పదో తరగతి చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభఅవార్డులకు ఎంపికయ్యారు. సాయినాథ్ (597), గురుభావన (595) మార్కులు సాధించారు. వీరికి ప్రతిభ అవార్డుకు ఎంపిక చేసిందని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న రమణారెడ్డి

ఉషాకిరణ్ విద్యార్థులకు: ఉషాకిరణ్ హైస్కూల్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు లభించాయి. తేజేష్, కేశవానంద్‌లకు ఈ అవార్డులు లభించాయని కరస్పాండెంట్ రమణారెడ్డి తెలిపారు. ఈ నెల 9వ తేదీన జిల్లా కేంద్రంలో నగదు బహుమతి, అవార్డులు అందుకోనున్నారని తెలిపారు.

సీఎం సహాయ నిధి పేదలకు వరం

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవి, పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ద్వారకానగర్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 18 మందికి రూ.12లక్షల చెక్కులను బాధితులకు అందించారు.



ఆజాద్‌నగర్‌లో అన్నీ సమస్యలే..!

సీకేదిన్నె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆజాద్‌నగర్ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆజాద్‌నగర్ ఏర్పడి 20 ఏళ్లు గడుస్తున్నప్పటికీ ఇక్కడ అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉంది. మురుగునీరు, చెత్త నిర్వహణ సరిగాలేక ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై మురుగుపారుతూ ఉండడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో రోడ్లపై నడవాలన్నా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కాలువలు మూసుకుపోయి మురుగునీరు అంతా రోడ్డుపై పారుతూ ఇబ్బందులపాలు చేస్తోంది. అయినప్పటికీ అధికారులు స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరోవైపు చెత్త ఎక్కడ పడితే అక్కడ వేస్తున్నారు. దీంతో చెత్తదిబ్బలు తయారు అవుతోంది. దుర్వాసన ఎక్కువ కావడంతో పందులకు నిలయంగా మారుతోంది. మరోవైపు దోమలు విజృంభించి వ్యాధుల భారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో ఇలా ఉంటే మిగతా పంచాయతీల పరిస్థితి ఏమిటని ప్రజలు ఆరోపిస్తున్నారు.





రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త,

రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బక్రీదుకు ఆవులు, ఒంటెలు కోస్తే శిక్షార్హులు

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీదు సందర్భంగా మండలంలో ఎవరైనా ఎక్కడైనా ఆవులు, ఒంటెలు వధిస్తే చట్ట ప్రకారం వారిపై చర్యలు తప్పవని సీఐ క్రిష్ణారెడ్డి హెచ్చరించారు. కేవలం పండుగలో మేకలు, పొట్టేళ్లు, గొర్రెలు వధించవచ్చని అలా కాకుండా చట్టవిరుద్ధంగా నిషేధించబడిన గోవులు, ఒంటెల వధ ఎవరే కానీ చేపట్టకూడదన్నారు. పైగా కేవలం పండుగే కాకుండా మిగతా ఏ రోజుల్లో అయినా ఇలాంటిచర్యలకు పాల్పడితే చర్యలు చేపడతామని హెచ్చరించారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

కడప కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ సందర్భంగా నగర రిమ్స్ సమీప శిల్పారామంలో ఈనెల 7వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 8-30 గంటల వరకు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి యస్. కృష్ణప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక శిల్పారామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో ప్రముఖ నృత్య కళాకారిణి విజయశాంతి సారథ్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయన్నారు. ఇదిలావుండగా ఈనెల 8వ తేదీ ఆదివారం జబర్దస్త్‌కు చెందిన ఆర్టిస్టులు శిల్పారామానికి హాజరుకానున్నట్లు స్పష్టం చేశారు.

నేడు అమ్మవారిశాలలో గౌరీవ్రతం

కడప కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నగర అమ్మవారిశాల కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో అవోపా మహిళా మండలి (కడప) సారథ్యంలో ఈనెల 7వ తేదీ ఉదయం 9-30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ లక్ష పసుపుకొమ్ముల గౌరీవ్రతం కార్యక్రమం జరుగనుంది. ఇందులో బ్రాహ్మణులు, ఆర్యవైశ్య మహిళలకు పసుపుకొమ్ములు, వాయినాల పంపిణీ చేయడం జరుగనుంది. సంప్రదాయ దుస్తులు ధరించి హాజరుకావాలని నిర్వాహకులు వెల్లడించారు.

లోపాలను సరిచేయాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):ప్రస్తుతం జరుగుతున్న టీచర్ ట్రాన్స్‌ఫర్స్‌లో టెక్నికల్ సమస్యల వల్ల తలెత్తిన తప్పిదాలను సరిచేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏటీ రామ కృష్ణంరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ షంషుద్దీన్ వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ సోమశేఖర్, అన్నమయ్య జిల్లా పెనగలూరు మండల నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అర్హత గల వారికి ప్రమోషన్ ఇవ్వాలి



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్,జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ యాజమాన్యంలోని ఉన్నత పాఠశాలలో గల ఖాళీలను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఎస్‌టీఎఫ్ రాష్ట్రఅధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ డాక్టర్ వెంకట సుబ్బయ్య,ప్రభుత్వ యాజమాన్య ఉపాధ్యాయులు ఉన్నారు.

ధ్యానంతో ప్రమాదాల నివారణ సాధ్యం

కడప కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీరోజూ క్రమం తప్పకుండా ధ్యానం చేయడం వలన మానసిక ప్రశాంతత చేకూరి తద్వారా రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా దోహదపడగలదని ఓం శాంతి బ్రహ్మకుమారీస్ అక్కయ్య ప్రదీపా సూచించారు. ప్రమాదాలు చేసిన ఆర్టీసీ డ్రైవర్లకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ ఆర్.ఎం. కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రదీపా అక్కయ్య హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు ఎస్‌డీఐ క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగా తప్పనిసరిగా చేయాలి

చక్రాయపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంగా ఉండేందుకు అరగంట సేపు యోగా చేయాలని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని నాగులగుట పల్లె గ్రామంలోని స్వయం సహాయక సఘాల సభ్యురాళ్లతో సమావేశ మయ్యారు. ఆమె మాట్లాడుతూప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్రకార్యక్రమంలో సంఘంలోని ప్రతి సభ్యురాలితో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఆర్థికంగానే కాకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఎస్తేరురాణి, సీసీలు రాజన్న, కరుణాకర్, మహేష్, నాగేశ్వరరావు, శివరాంప్రసాద్, ఎంఎస్ అధ్యక్షురాలు నాగమణి,అకౌంటెంట్స్ వీఓఏలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.


గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వేంపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని పింఛనర్ల సంఘం మండల కార్యదర్శి వెంకటరామిరెడ్డి, గ్రంథాలయ అధికారి వనజకుమారి తెలిపారు. గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో గ్రంథాలయానికి వచ్చే పిల్లలకు పలు పోటీలు నిర్వహించారు. ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఏపీ సేవా పోర్టల్ సేవలు నాలుగు రోజుల పాటు నిలిపివేత

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్ సేవలు ప్రభుత్వ సూచనల మేరకు 7వతేదీ నుంచి 10వతేదీ వరకు నిలిపివేస్తున్నట్లు ఎంపీడీవో కిరణమోహన్‌రావు తెలిపారు. ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ నుంచి ఏపీ డేటా సెంటరుకు తరలింపు జరుగుతోందని, ఈ పనుల నిర్వహణ నిమిత్తం 7వతేదీ ఉదయం నుంచి 10వతేదీ రాత్రి వరకు అందిస్తున్న సేవలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఆదాయ ధృవీకరణ పత్రం, సమగ్ర ధృవీకరణ పత్రం, భూమి మ్యుటేషన్లు, రైస్‌కార్డులు, ఇళ్లస్థల పట్టాలు, వృద్ధాప్యధృవీకరణపత్రాలు, వివాహ ధృవీకరణ పత్రాలు, రెవెన్యూ వాటర్‌ట్యాక్స్ మత్స్యశాఖ సేవలు, పట్టణపరిపాలన సేవలు మినహా మిగిలిన ఇతర ప్రభుత్వ సేవలు మాత్రం ఉంటాయని అవి మీసేవాకేంద్రాల ద్వారా పొందవచ్చన్నారు. ఇందుకు ప్రజలు సహకరించాలని ఆయన తెలిపారు.

వైభవంగా ఉత్తరద్వార దర్శనం



మోక్షనారాయణస్వామి

కమలాపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామాపురం మహాపుణ్యక్షేత్రంలో శుక్రవారం నిర్జల ఏకాదశి సందర్భంగా ఆలయ నిర్వాహకుడు కాశీభట్ల సత్యసాయినాథశర్మ భక్తులకు ఉత్తర ద్వారదర్శనం ఏర్పాట్లు చేశారు. ప్రతి మాసంలో వచ్చే ఏకాదశినాడు ఉత్తర ద్వారం ద్వారా భక్తులు మహాలక్ష్మి సమేత మోక్ష నారాయణస్వామి శ్రీవల్లి దేవసేన షణ్ముఖ సుబ్రమణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటే మహా పుణ్యఫలం దక్కుతుందని భక్తులు ఇక్కడ విశ్వసిస్తుంటారు. ఏకాదశి సందర్భంగా ఆలయంలో ఉదయం ప్రధాన దేవత మూర్తులకు అభిషేకాలు కల్యాణం నిర్వహించారు. సాయంత్రం గరుడ వాహనంపై మోక్ష నారాయణుడు మాడవీధుల్లో ఊరేగించారు. నిర్జల ఏకాదశి గరుడ పురాణంలో ప్రత్యేకమైన ఏకాదశని భక్తులందరూ ఉత్తర ద్వారం ద్వారా ప్రవేశించి దర్శించి దేవుని కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

సెర్ఫ్ ఉద్యోగులకు బదిలీలు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఒకే చోట ఐదు సంవత్సరాలకు పైబడి విధులు నిర్వహించే వారిని మరో చోటకు బదిలీ చేశారు. బదిలీ అయిన వారిలో కలసపాడు ఏపీఎం వీరాంజనేయులుతో పాటు మరో నలుగురు సీసీలకు స్థానచలనం కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ వీణా వెంకటేశ్వరప్రసాద్, హెచ్‌ఆర్ అధికారి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

పెండ్లిమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):రైతులు పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని భారత నూనె గింజల పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త కదర వేల్ తెలిపారు.మండల పరిదిలోని చెర్లోపల్లె,పెండ్లిమర్రి గ్రామాల పరిధిలో శక్రవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తడాక్టర్ వీరయ్య ,పశువిజ్ఞాన శాస్త్రవేత్త సురేష్ కుమార్ రెడ్డి,గిరీష్ కుమార్,చెర్లోపల్లె,పెండ్లిమర్రి సర్పంచులు గంగిరెడ్డి,నాగమల్లారెడ్డిలు,అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



వేంపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణంలోని పలు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారానీటి సరఫరా చేస్తున్నారు. పాపాఘ్నినది నుంచి వేంపల్లెకు నీటి సరఫరా జరుగుతోంది. పాపాఘ్ని నుంచి వచ్చే పైప్‌లైన్ దెబ్బతినడంతో నీటి సరఫరా నిలిచిపోయింది. స్థానిక సర్పంచు ఆర్.శ్రీను పైప్‌లైన్ మరమ్మతుకు చర్యలు చేపట్టారు. ఈలోగా అత్యవసరమైన పలుకాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేయించారు. పైప్‌లైన్ మరమ్మతు చేయించి యథావిధిగా నీటిసరఫరా చేయిస్తామని సర్పంచు తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ



పులివెందుల రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థినుల ఆరోగ్య రీత్యా దోమల నివారణకు ఏసీఎం పిచికారీ చేయిస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య పేర్కొన్నారు. శుక్రవారం పులివెందులలోని ప్రభుత్వ బాలికల కలాశాల వసతిగృహం, మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలికల పాఠశాలలో ఏసీఎం పిచికారీ చేశారు. ఆయన మాట్లాడుతూ దోమల నివారణచర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సోమలింగారెడ్డి, సిబ్బంది రమేష్‌రెడ్డి, శివమ్మ పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

కడప కల్చరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వేసవి సెలవుల నేపథ్యంలో నగర కొండాయపల్లెలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గత ఏప్రిల్ 28 నుంచి ఈనెల 6వ తేదీ వరకు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దాదాపు 40 రోజుల పాటు సాగిన క్యాంప్‌లో యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, గ్రామర్, మోటివేషన్‌క్లాస్, ఇండోర్‌గేమ్స్, బేసిక్ మ్యాథ్స్, క్యూబ్‌గేమ్, డ్యాన్స్ తదితర విభాగాలలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. సమ్మర్ క్యాంపులో వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, కథలురాయడం, చెప్పడం, తదితర పోటీలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ భారతి, లైబ్రేరియన్ జేమ్స్, సురేష్, సిబ్బంది రమణ పాల్గొన్నారు.

బోరు వేశారు.. కనెక్షన్ మరిచారు..!

సీకేదిన్నె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు బోరు వేశారు. అయితే కనెక్షన్ ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారు. ఎమ్మెల్యే పుత్రా చైతన్యరెడ్డి ఆదేశాల మేరకు విశ్వనాథపురం హిందూశ్మశాన వాటికలో నాలుగు నెలల క్రితం బోరు వేశారు. దీంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. అయితే బోరు వేసినా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో అవసరాల కోసం నీటికోసం ఇబ్బందులు పడాల్సివస్తోంది. శ్మశానానికి బోరు కనెక్షన్ ఇచ్చి ప్రహరీ నిర్మిస్తే ఎంతో అనుకూలంగా ఉంటుందని నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం చేపట్టకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా 18వ డివిజన్ అధికారులు స్పందించి బోరు కనెక్షన్ ఇచ్చి ప్రహరీ నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



శ్మశానానికి వేసిన బోరుకు మోటారు బిగించని దృశ్యం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
I
శనివారం 7 జూన్ 2025





హత్య కేసులో నిందితులు అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ చల్లని దొర

వీరపునాయునిపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వీరపునాయుని పల్లె ఎస్సీ కాలనీకి చెందిన అనిమెల ఆంజనేయులు (51) హత్య కేసులోని నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పెండ్లిమర్రి సీఐ చల్లని దొర విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆంజనేయులుకు నిందితుల మధ్య గోడ స్థలం, భూముల విషయమై తగాదాలు ఉండేవి. ఇది మనసులో పెట్టుకున్న నిందితులు బెలుకూరి నరేష్, బెలుకూరి నవీన్‌కుమార్, శ్రీరాముల బోగాది, బెలుకూరి రెడ్డిమహేష్‌లు గత 27వ తేదీ ఎస్సీ కాలనీ సందులో ఆంజనేయులు ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళ్తుండగా రోకల బండతో కొట్టి హత్య చేసి పారిపోయారన్నారు. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి.. నిందితులను 5వ తేదీ సాయంత్రం అరెస్టు చేశామని తెలిపారు. వీరిని కమలాపురం కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ మంజునాథ్, పోలీసులు పాల్గొన్నారు.

కోడిపందెంరాయుళ్లు అరెస్టు



కమలాపురం రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగవరం గ్రామం పొలాల మధ్యలో కోడిపందేలు నిర్వహిస్తున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గంగవరం గ్రామాన్ని ఆనుకుని పెన్నానది పరివాహక ప్రాంతంలో కోడిపందాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. మధ్యాహ్నం సుమారు 1.30గంటల ప్రాంతంలో దాడి చేసి 11 మంది వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి ఐదు పందెం కోడిపుంజులను, రూ.20,200 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బుగ్గల నాగేంద్ర (ఫైల్ ఫొటో)

రాజంపేట టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండల పరిధిలోని ఎస్ఆర్‌పాలెం సమీపంలో బుగ్గల నాగేంద్ర(38) ప్రమాదవశాత్తు ఆటో నుంచి పడి తలకు తీవ్ర గాయం కావడంతో మృతి చెందాడు. నాగేంద్ర భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి రాయచోటి సమీపంలో ఉన్న చిన్నమండెం వద్ద ఉన్న అత్తగారింట్లో వదిలి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం సంభవించింది. అతివేగంతో వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు బంధువులు తెలిపారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మన్నూరు పోలీసులు తెలిపారు.

పత్రికా ప్రకటన

వై.యస్.ఆర్. జిల్లా నూతన కలెక్టరు వారి కార్యాలయం నందు లాప్‌టాప్స్ మరియు స్కానర్లు కొనుగోలు చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనది. లాప్‌టాప్స్ మరియు స్కానర్లు (Configuration) వివరాలు 09.06.2025వ తేది నుండి 20.06.2025వ తేది మధ్యాహ్నం 02.00 గంటల వరకు పరిపాలన అధికారి, కలెక్టరు వారి కార్యాలయము (సి.బ్లాక్) నందు లభించును. దరఖాస్తుదారులు దరఖాస్తు కొరకు రూ.7500/-లు జాయింట్ కలెక్టరు, కడప పేరున డి.డి. చెల్లించి దరఖాస్తుకు స్వీకరించవలెను. పూర్తి చేసిన దరఖాస్తును 20.06.2025వ తేది మధ్యాహ్నం 05.00 గంటల సమయం లోపు సమర్పించవలెను. 20.06.2025వ తేదిన సాయంత్రం 06.00 గంటలకు టెండర్లు తెరవబడును. అన్ని అర్హతలు మరియు షరతుల గురించి దరఖాస్తుతో పాటు ఇవ్వబడును.

సం/- శ్రీమతి అదితి సింగ్, ఐ.ఏ.ఎస్.
జాయింట్ కలెక్టర్ / ఛైర్మన్, డి.సి.సి. కడప.

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ల పరీక్షా ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ప్రొఫెసర్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారావు

కడప ఎడ్యుకేషన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఎల్ఎల్‌బీ (3, 5 సంవత్సరాల), 3,5,7,9 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలను విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావు, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ చంద్ర ఓబుళరెడ్డి శుక్రవారం పరిపాలన భవనంలో విడుదల చేశారు. ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్‌లో 81 శాతం ఫలితాలు, ఐదో సెమిస్టర్‌లో 76శాతం, ఏడో సెమిస్టర్‌లో 61శాతం, తొమ్మిదో సెమిస్టర్‌లో 91.67శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వివరించారు. ఎల్ఎల్‌బీ మూడు సంవత్సరాల కోర్సు 3వ సెమిస్టర్‌లో 23.81 శాతం, 5వ సెమిస్టర్‌లో 88.24శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్ష ఫలితాలను సకాలంలో విడుదల చేసిన కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగాన్ని రిజిస్ట్రార్ అభినందించారు.

41 చీనీ చెట్ల నరికివేత


నరికిన చీనీ చెట్లను పరిశీలిస్తున్న భూపేశ్‌రెడ్డి

కొండాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనమల చింతల గ్రామంలో గురువారం రాత్రి ప్రసాద్ అనే టీడీపీ కార్యకర్తకు చెందిన 41 చీనీ చెట్లను నరికివేశారు. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి వివరాల మేరకు.. ప్రసాద్ శుక్రవారం ఉదయం తన తోట వద్దకు వెళ్లగా మూడు సంవత్సరాల వయసు గల 41 చీనీ చెట్లను నరికివేసినట్లు గమనించాడన్నారు. దీంతో తమకు ఫిర్యాదు చేయగా చీనీ తోటను పరిశీలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పిరికిపంద చర్య... భూపేశ్‌రెడ్డి

టీడీపీ కార్యకర్త ప్రసాద్‌కు చెందిన 41 చీనీ చెట్లను నరికివేయడం పిరికిపంద చర్య అని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయింత్రం ఎనమల చింతల గ్రామంలో నరికిన చీనీచెట్లను ఆయన పరిశీలించారు. ఇది కుట్రపూరితంగానే జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఇలాంటి చర్యలతో తమ కార్యకర్తలను మానసికంగా దెబ్బతీయాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని కోరారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళాతమని తెలిపారు. కూటమి నాయకులు శివనారాయణరెడ్డి, రమేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, లావనూరు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నెలాఖరులోపు పంచాయతీలకు శుద్ధినీరు సరఫరా


వాటర్ గ్రిడ్‌పనులను పరిశీలిస్తున్న అధికారులు

లింగాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లింగాల, సింహాద్రిపురం మండలాల్లోని 30 పంచాయతీలకు ఈ నెలాఖరులోగా వాటర్ గ్రిడ్ ద్వారా శుద్ధినీటి సరఫరా చేస్తామని జల్‌జీవన్ మిషన్ పులివెందుల, కేంద్ర ఫర్టిలైజర్ అండ్ నోడల్ ఆఫీసర్ ముఖేష్ మేఘ్వాల్, డ్రింకింగ్ వాటర్ శానిటేషన్ టెక్నికల్ ఆఫీసర్ నవనీత్ ఉపాధ్యాయ అన్నారు. లింగాల మండలం పార్నపల్లె గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ పనులను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రయల్ రన్‌పూర్తిచేసి నెలాఖరులోగా 30 పంచాయతీలకు నీటిని సరఫరా చేస్తామని తెలిపారు. పనుల నాణ్యతను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు, ఈఈ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్‌లో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గీత

మదనపల్లె టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో చదువుతున్న శివాని గుజరాత్ రాష్ట్రంలో నిర్వహించిన నవోదయ పారా స్పోర్ట్స్ (దివ్యాంగుల క్రీడలు) షాట్‌పుట్ విభాగంలో మూడు గోల్డ్ మెడల్స్, జావెలిన్ త్రోలో నాలుగు గోల్డ్‌మెడల్స్ సాధించిందని ప్రిన్సిపాల్ గీత తెలిపారు. మరో విద్యార్థిని చందన హ్యాండ్ సైక్లింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

చనిపోయిన వ్యక్తి పేరుతో సర్వేకు చలానా

రాయచోటి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాల క్రితం చనిపోయిన తన తండ్రి పేరు మీద కోర్టు కేసులో ఉన్న భూమి సర్వే కోసం ప్రతివాది చలానా కట్టిన విషయమై గురువారం తుమ్మగింజల వెంకటరమణ రాయచోటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

మండలంలోని మాధవరం గ్రామంలోని సర్వే నెంబరు 891/3లోని 2.65 ఎకరాల భూమి విషయమై కోర్టులో మా తండ్రి తుమ్మగింజల చిన్నగంగులు, కదిరి రామచంద్ర మధ్య వివాదం నడుస్తోంది. మా తండ్రి 2015 లో చనిపోయారు. దాంతో నేను ప్రతివాదిగా ఉన్నాను. అయితే ఇటీవల కదిరి రామచంద్ర ఆ భూమి సర్వే కోసం చలానా మా తండ్రి పేరు మీద కట్టి.. అధికారులను తప్పు దోవ పట్టించాలని చూశాడు. కాబట్టి.. ఆ చలానా విషయమై విచారించి తగు చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

యువకుడిపై దాడి... తీవ్ర గాయాలు



కడప క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట మండలం ముత్తలూరుపాడు దళితవాడకు చెందిన పిచ్చిమల్లుగాళ్ల శివాజీ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు మూకుమ్మడిగా మారణాయుధాలతో దాడి చేశారు. దీంతో శివాజీకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు... శివాజీకి చెందిన స్థలంలో వీధిలైట్ల స్తంభాలు నాటే విషయమై కత్తి వెంకటరమణ, కత్తిశేఖర్, కత్తి గిరి, కత్తి అడవి రాముడు, కైలాస్ దాడికి పాల్పడ్డారన్నారు. దీంతో శివాజీ తలకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కడప రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రిమ్స్ ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి.. ఖాజీపేట పోలీసుస్టేషన్‌కు బదాలాయించారు.

మోసం చేశారని ఫిర్యాదు

పులివెందుల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తన తండ్రికి సంబంధించిన స్థలం విషయంలో ఐదుగురు సభ్యులు మోసం చేశారంటూ పులివెందులకు చెందిన దుష్యంత్‌రెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అర్బన్ ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల మేరకు.. దుష్యంత్‌రెడ్డి తండ్రి విజయభాస్కర్‌రెడ్డికి బెంగుళూరులో 50సెంట్ల స్థలం ఉందన్నారు. ఆ స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు ఐదుగురిని సభ్యులుగా చేసి రిజిస్ట్రేషన్ ఆఫ్ పవర్ ఇచ్చారన్నారు. అయితే ఇటీవల విజయభాస్కర్‌రెడ్డి మృతి చెందారు. అనంతరం దుష్యంత్‌రెడ్డి తండ్రి ఇంట్లో స్థలానికి సంబంధించిన పత్రాలు బయట పడ్డాయన్నారు. ఈ పత్రాలకు సబంధించిన వివరాలు దుష్యంత్ రెడ్డి సేకరించగా అసలు విషయం బయటపడిందన్నారు. అభివృద్ధి చేసేందుకు ఇచ్చిన స్థలంలో వచ్చిన డబ్బును ఐదుగురు సభ్యులు పంచుకున్నారని, తన తండ్రికి ఇవ్వలేదని, ప్రస్తుతం ఆ స్థలాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారని గుర్తించారు. దీంతో ఐదుగురు మోసం చేశారని గుర్తించి దుష్యంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేరుశనగ గడ్డి వామి దగ్ధం

పెండ్లిమర్రి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నల్లయ్యగారిపల్లెలో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో శివరామిరెడ్డి అనే రైతుకు చెందిన వేరుశనగ గడ్డివామి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బందికి ఫోన్ చేయడంతో వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగరాని నష్టం జరిగిందని రైతు వాపోయాడు. దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందన్నారు.

ప్రమాదవశాత్తు ఆటో రిక్షా దగ్ధం



వేంపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం పులివెందుల రోడ్డులో ఉన్నట్లుండి ఆటోరిక్షా దగ్ధమైంది. స్థానికంగా ఉన్న రహంతుల్లా ఆటో రిక్షాలో మూటెలు, ఇతర వస్తువులు తరలిస్తూ జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి పులివెందుల రోడ్డులోకి వెళ్తుండగా ఉన్నట్లుండి ఆటో రిక్షా నుంచి మంటలు వచ్చాయి. నిమిషాల్లోనే పెద్దఎత్తున మంటలు చెలరేగి దగ్ధమవుతుండగా స్థానికుల సహకారంతో నీళ్లుచల్లి మంటలను ఆర్పివేశాడు. జీవనాధారమైన ఆటోరిక్షా ప్రమాదవశాత్తు కాలిపోవడంతో ఉపాధి కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రొద్దుటూరులో అందుబాటులోకి సూపర్ స్పెషాలిటీ సేవలు

లక్ష్య కార్డియాక్ సూపర్‌స్పెషాలిటీ నూతన ఆసుపత్రి ప్రారంభం


లక్ష్య కార్డియాక్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గుండె ఆపరేషన్లకు సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా ప్రొద్దుటూరులో సేవలు అందించేలా లక్ష్య సూపర్‌స్పెషాలిటీ కార్డియాక్ ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక నెహ్రూరోడ్డులో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పాతకోట శ్రీనాధ్‌రెడ్డి, డాక్టర్ హరితల ఆధ్వర్యంలో లక్ష్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనాధ్‌రెడ్డి మాట్లాడుతూ గుండె వైద్యంతో పాటు కంటి వైద్యం కూడా లక్ష్య సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో లభిస్తుందన్నారు. గత దశాబ్ద కాలంగా ప్రొద్దుటూరుతో పాటు చుట్టు పక్కల నియోజకవర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించే భాగ్యం తమకు కలిగిందని.. వారి ఆదరణతో లక్ష్య ఆసుపత్రి అభివృద్ధి చెందిందన్నారు. అధునాతన వైద్య పరికరాలతో గుండె వైద్యంతోపాటు కంటి వైద్యం లక్ష్య ఆసుపత్రి లక్ష్యమన్నారు. కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖ వైద్యులు, వ్యాపార వేత్తలు, రాజకీయ నాయకులు హాజరయ్యారు.

ఉత్తరాఖండ్ శిక్షణకు జడ్పీ సీఈవో ఓబులమ్మ

● డిప్యూటీ సీఈవోకు ఇన్‌చార్జ్ సీఈవోగా బాధ్యతలు

కడప రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (జడ్పీ సీఈవో) సి.ఓబులమ్మ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో 5 రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణకు హాజరవుతున్నారు. ముస్సోరీలోని లాల్ బహదూర్‌శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ వారు (ఎల్‌బీఎస్ఎన్ఏఏ) జూన్ 9 నుండి 13 వరకు పంచాయతీరాజ్ సంస్థలు, గ్రామీణాభివృద్ధిలో పాలన క్లిష్టమైన సమస్యలు అనే అంశంపై ఇన్-సర్వీస్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈమేరకు రాష్ట్రంలో పీఆర్ అండ్ ఆర్డీ విభాగంలో పనిచేస్తున్న ఐఏఎస్ అధికారులు గానీ లేక జిల్లా ప్రజాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారులలో ఇద్దరు అధికారులను నామినేటెడ్ చేయాలని పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్‌ను కోరారు. ఈమేరకు ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ నుంచి ఇద్దరు సీఈవోలను నామినేటెడ్ చేశారు. అందులో కడప జిల్లా, విశాఖపట్నం జడ్పీ సీఈవోలు సి.ఓబులమ్మ, పి.నారాయణమూర్తిలను సూచించారు. పైన పేర్కొన్న శిక్షణా కార్యక్రమానికి హాజరు కావడానికి సీఈవో ఓబులమ్మ వెళ్లారు. శిక్షణ ముగింపు వరకు డిప్యూటీ సీఈవో మైథిలికి ఇన్‌చార్జ్ సీఈవోగా బాధ్యతలను అప్పగించారు.

లక్ష ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్

● విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ


మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

కడప మారుతీనగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్యం మేరకు లక్ష గృహాలకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ అన్నారు. ఇందులో భాగంగా కడప విద్యుత్ భవన్‌లోని తన చాంబరులో బ్యాంకర్లు, అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుపై ప్రజలలో అవగాహన పెంచాలన్నారు. బ్యాంకర్ల సలహాలు మెండుగా ఉండాలన్నారు. ఒక్క కిలోవాట్ కెపాసిటీ సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుంటే నెలకు 120 యూనిట్ల విద్యుత్‌ను, అదే రెండు కిలోవాట్ల కెపాసిటీతో ఏర్పాటు చేసుకుంటే 240 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తుందన్నారు. వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులను గణనీయంగా తగ్గించుకోవడమే కాకుండా తిరిగి మిగులు విద్యుత్ యూనిట్‌కు రూ.2.09 వంతున పొందవచ్చన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ పొంది సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జనార్దన్, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ యలారెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మల్లికార్జున, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు మధుసూదన్, హరిసేవ్యనాయక్, భరణికృష్ణ, ప్రసాద్‌రెడ్డి, డీఈఈ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సీటీఐ, టీటీఐల పనితీరు అభినందనీయం

● చీఫ్ కమర్షియల్ మేనేజర్ రమేష్‌బాబు


ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్‌తో సీటీఐ, టీటీఐలు

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీటీఐ, టీటీఐల పనితీరు అభినందనీయమని ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ రమేష్‌బాబు అన్నారు. శుక్రవారం రేణిగుంట రైల్వేస్టేషన్ వీఐపి లాంజ్‌లో టిక్కెట్లు లేకుండా రైల్లో ప్రయాణిస్తున్న వారిని గుర్తించి వారి ద్వారా అపరాధ రుసుం వసూలు చేసి రైల్వేకు రికార్డు స్థాయిలో ఆదాయాన్ని తీసుకువచ్చిన కడపకు చెందిన పలువురు చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్లు (సీటీఐ), ట్రావెలింగ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్లు (టీటీఐ)లకు ప్రశంసాపత్రాలను అందించారు. కడప రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్‌కు చెందిన సీటీఐలు ద్వారకనాథరెడ్డి, నరసింహారెడ్డి, మహబూబ్ బాషలతో పాటు టీటీఐలు రాజశేఖర్, హరికిశోర్‌రెడ్డి,రమేష్ రాఘవేంద్రారెడ్డి, చైతన్యబాబు, ప్రసన్నకుమార్‌లు ప్రశంసాపత్రాలను అందుకున్నారు.

ప్రతిష్ఠలో అపశ్రుతి... ముక్కలైన ధ్వజస్తంభం


కనుపర్తిలో ప్రతిష్ఠ సందర్భంగా ముక్కలైన ధ్వజస్తంభం

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనుపర్తి గ్రామంలో శుక్రవారం ధ్వజప్రతిష్ఠలో అపశ్రుతి జరిగింది. రాతి ధ్వజస్తంభం ప్రతిష్ఠించే సమయంలో మూడుముక్కలుగా విరిగింది. దీంతో భక్తులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. చాలా ఏళ్లక్రితం గ్రామంలో బండ్లపల్లె కుటుంబీకులు ఆంజనేయస్వామి ఆలయం నిర్మించారు. గతంలో ఈ ఆలయానికి చెక్క ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. ఇది కాలక్రమంలో చెదలుపట్టింది. దీంతో రాతి ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు ఆళ్లగడ్డ నుంచి రూ.3లక్షలు వెచ్చించి 36 అడుగుల పొడవు ఉన్న ధ్వజస్తంభం తీసుకువచ్చారు. ప్రతిష్ఠ చేసేందుకు శుక్రవారం క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ఎత్తుతుండగా మూడు ముక్కలుగా విరిగింది.

ఉరి వేసుకుని వివాహిత మృతి


తేజశ్రీ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎంత వారించినా భర్త మద్యం తాగేది ఆపకపోవడంతో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మదనపల్లె పట్టణం టీకేపల్లె కాలనీకి చెందిన శివకేశవ, రెడ్డెమ్మ కుమార్తె కె.తేజశ్రీ(23)ని కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాకు చెందిన రఘుతో రెండేళ్ల క్రితం వివాహం చేశారు. వారు స్థానిక నీరుగట్టువారిపల్లెలో నివాసముంటున్నారు. ఏడాది క్రితం వారికి ఓ కుమారుడు పుట్టాడు. కాగా, రఘు నిత్యం మద్యం సేవిస్తుండటంతో తేజశ్రీ వారిస్తూ వుండేది. గురువారం రాత్రి ఇంటి వద్ద రఘు మద్యం సేవిస్తుండగా, అతనితో తేజశ్రీ గొడవపడింది. అయినా, అతను మద్యం తాగేది ఆపకపోవడంతో ఇంట్లోకి వెళ్లి ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు ఆమెను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టు టౌన్ సీఐ రామచంద్ర తెలిపారు.



బాధ్యతతో ప్రజా సేవ చేయండి



ఎమ్మెల్యే పుట్టా ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం



గజమాలతో సత్కరిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

మైదుకూరు రూరల్ ,జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు మార్కెట్ యార్డు నూతన పాలకవర్గం బాధ్యతగా పని చేసి ప్రజల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పేర్కొన్నారు. టీడీపీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచే సేవారికి పార్టీలో ఉన్నతస్థానం లభిస్తుందనడానికి ఏపీ రవీంద్రకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి రావడమేనని ఆయన అన్నారు. మైదుకూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఏపీ రవీంద్ర సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి శుక్రవారం నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు. రవీంద్ర ఇంటి వద్ద నుంచి భారీ ర్యాలీగా జిల్లా పరిష త్ హైస్కూల్ వద్దకు చేరుకొ న్నారు. అక్కడ మార్కెట్ కమిటీ అధికారులు చైర్మన్‌గా ఏపీ రవీంద్ర, వైస్ చైర్మన్‌గా నాయబ్‌రసూల్, మెంబర్లుగా ఎ. భారతి, పి కార్తీక, ఎస్ హుసేన్‌బీ, జి లక్ష్మి భర త్, జయలక్ష్మి, ఎస్ వనజ, ఆశీ ర్వాదం, క్రిష్ణనాయక్, వెంకటరమణ య్య, వెంక టసుబ్బమ్మ, క్రిష్టారెడ్డి, వెంకటరామిరెడ్డి, రత్నమ్మలు ఎమ్మె ల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆధ్వ ర్యంలో ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా మాట్లాడుతూ మున్సిపాలిటీలో నీటి సమస్య లేకుండా పోయిందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకు లు హరిప్రసాద్, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ మెంబరు యాపరాల చిన్న, పందిటి మల్హోత్ర, భీమయ్య, సుబ్బారెడ్డి, అన్నవరం సుధాకర్‌రెడ్డి, పుట్టా ప్రభాకర్‌యాదవ్, కేశ ఎరికిల య్య, బండి అమర్ నాధ్, తుపాకుల రమణ, ధనపాల యుగంధర్, ధనపాల భారతి, నాగశివారెడ్డి పాల్గొన్నారు.

ఖాజీపేటలో: మైదుకూరులో శుక్రవారం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా రవీంద్ర, వైస్‌చైర్మన్‌గా నాయబ్‌రసూల్‌ను టీడీపీ రాష్ట్ర మైనార్టీ మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి కదిరుల్లా, నాయకులు గజమాలతో సత్కరించారు.



కొనసాగిన కార్మికుల ఆందోళన

ఎర్రగుంట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల ఆల్ట్రాటెక్ (ఐసీయల్) సిమెంటు కర్మాగారం వద్ద కాంట్రాక్టు కార్మికులు రెండవ రోజూ శుక్రవారం ధర్నా కొసాగించారు. తమకు సమస్యలు పరిష్కారించేంత వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. వారికి స్థానిక ఎన్డీయే నేతలు మద్దతు ఇస్తున్నారు.

తిరుమలయ్యకు ఘన సన్మానం



తిరుమలయ్యను సన్మానిసస్తున్న సర్పంచ్ యనమల సుధాకర్ తదితరులు

పోరుమామిళ్ల, జూ న్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసరిపల్లెకు చెందిన ఆర్టీసీ కండెక్టర్‌గా పదవీ విరమణ చేసిన తిరుమలయ్యకు పోరుమామిళ్లలో కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు, రాజకీయ నాయకులు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. దాసరిపల్లె కు చెందిన తిరుమలయ్య నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో కండెక్ట రుగా విధులు నిర్వహిస్తూ మే 31 న పదవీ విరమణ చేశారు, శుక్రవారం పోరుమామిళ్ల మేజరు పంచాయతీ పరిధిలోని మల్లకతవ వద్ద వెంకటేశ్వర ఫంక్షన్‌హాలులో ఆయనను కూటమి నేత బొజ్జ రోశన్న, మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, టీడీపీ నాయకులు తిరుమలశెట్టి సుబ్బారావు, సెట్టింప్రతాప్, సీతా వెంకటసుబ్బయ్య, తోట వెంకటయ్య ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన వారికి భోజనం అందించారు.



ఆవు, దూడ, ఒంటెల వధ నిషేధం

ఎర్రగుంట్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్లమున్సిపాలిటి పరిధిలో బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలు, ఒంటెలు వధను నిషేదించినట్లు పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మునెయ్య, చిలమకూరు పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డిలు తెలిపారు. ఈవిషయంపై శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శేషఫణి, పోలీసులతో చర్చించారు. ఎర్రగుంట్లలోని వధశాలలను వారు పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించి వధ చేస్తే వారిపై జంతుహింస నివారణ చట్టం చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ముద్దనూరులో:బక్రీద్ రోజు ఆవులు, దూడలు,ఒంటెలను వధించరాదని, గోవధ నిషేద చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ముస్లిం, హిందువులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు వివరిస్తూ.. ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని సూచించారు. కరోనాను దృష్టిలో పెట్టుకొని మాస్కులు ధరించి ప్రార్థనల్లో పాల్గొనాలన్నారు. పశువైద్యాధికారులు పరీక్షించిన జీవాలను మాత్రమే వధించి విక్రయించాలని ,ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వెటర్నరీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి,పశువైద్యాధికారిణి హిమబిందు, ఏఎస్ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.



ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికి నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు నెల రోజులపాటు సమ్మర్ క్యాంపు నిర్వహించారు. కార్యక్రమంలో వసంతపేట మున్సిపల్ హైస్కూలు హెచ్‌ఎం గురప్ప, రచయితలు డీకే చదువులబాబు, జింకా సుబ్రమణ్యం, గంగాధర్‌రెడ్డి, గజ్జెల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

ఎర్రగుంట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిలో బాగంగా జూట్ బ్యాగుల తయారీపై సున్నపురాళ్ల పల్లె గ్రామానికి చెందిన 35 మంది మహిళలకు శిక్షణ మొదలైంది. కెనారాబ్యాంక్ గ్రామీ ణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ కడప వారి ఆధ్వర్యంలో గ్రామంలోని మహిళలకు 14రోజుల పాటు శిక్షణ ఇస్తారు. 35 మందికి శిక్షణ ఇచ్చేందుకు అవగాహన కల్పించారు.

గంజాయి విక్రయదారుల అరెస్టు

ప్రొద్దుటూరు , జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు లో ముగ్గురు గంజాయి విక్రయదారులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం డి హుస్సేన్ బాషా, కె సంతోష్, కార్తీక్ అనే ముగ్గురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎక్సైజ్ సీఐ సురేంద్రనాధ్‌రెడ్డి ఆధ్వర్యంలో వారిని అరెస్టు చేసి వారి వద్దనుండి 5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కడప ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నీలకంటేశ్వర రెడ్డి వున్నారు.





అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

బద్వేలు రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ఏరువాక పౌర్ణ మిని పురస్కరించుకుని బద్వేలు డిపో నుంచి ఈ నెల 10న ప్రత్యేక బస్సును అరుణాచలానికి నడుపుతున్నామని ఆర్టీసీ డీఎం నిరంజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న మధ్యాహ్నం 11.30 నుంచి ఆర్టీసీ బస్టాండు నుంచి బస్సు బయల్దేరుతుందని రూ.1250 టికెట్ ధర ఉంటుందన్నారు. ఏరువాక పౌర్ణమి వల్ల ఈ అవకాశాన్ని భక్తులు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225779, 7382867104లను సంప్రదించాలన్నారు.

బోరు, మోటారు మరమ్మతులు

దువ్వూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నీలాపురం హైస్కూలు పరిధిలో పాడై ఉన్న బోరు, మోటారు మరమ్మతులు ఎట్టకేలకు శుక్రవారం పూర్తి చేశారు. ఇక్కడ పాఠశాలలో ఈ బోరు ద్వారా 150 మంది విద్యార్థులకు తాగునీరు అందనుంది. ఇది పాడై 40 రోజులు కావస్తోంది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఎంపీడీవో హరి కృష్ణయాదవ్, గ్రామ సర్పంచ్ రామయ్య చొరవ తీసుకుని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా మరమ్మతులు చేయించారు. పాఠశాలలు తెరవనున్నడంతో దీన్ని మరమ్మతులు చేపట్టారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



